# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 6, ఆగస్టు 2026






# సమర్థవంతమైన ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చర్యలు

*** రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 5, ప్రభాతవార్త

రాష్ట్రంలో సమర్థవంతమైన ప్రజాపాలన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొమురంభీమ్ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ వనజా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజల కోసం, ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ చేసిన వీరోచిత పోరాటం చిరస్మరణీయమని, భావితరాలకు చరిత్ర అందించేలా కొమురం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు 20 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేయడం జరుగుతుందని, జైపూర్ మండలంలో కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు కొరకు స్థల కేటాయింపుపై పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షల రూపాయల వరకు వైద్య సేవలు, అర్హులకు రేషన్ కార్డులు అందించే చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ వంటి అనేక పథకాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు పథకం వర్తింప చేయడం జరుగుతుందని, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమ పరిధిలో గల పెంకుటిళ్లను మిగతా 2లో..

# సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం

**✪ అత్యాశకు పోయి మోసపోవద్దు.. ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయొద్దు: జిల్లా ఎస్పీ నితికా పంత్**

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5, ప్రభాతవార్త

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగృత్ దివస్–సురక్షిత్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని హెచ్ఆర్‌డీ భవన్‌లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా నేరాలు, సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ స్టాకింగ్ తదితర అంశాలపై వీడియోల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి మిగతా 2లో..




# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలి

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5, ప్రభాతవార్త :



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు నేడు వ్యాపార రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదిగి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ మిషన్ల ద్వారా తమ నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని, మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా జిల్లాలో సుమారు మిగతా 2లో..

# రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

*** న్యూ వెల్మల్‌లో రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

*** రైతులు సహకరించాలి అధికారులకు ఆదేశాలు**



నిర్మల్, ఆగస్టు 05, ప్రభాతవార్త:

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ప్రక్రియ ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో మిగతా 2లో..

# సమర్థవంతమైన ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని తెలిపారు. చెన్నూర్ మండలంలో దాదాపు 1 వేయి ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని, నిబంధనల ప్రకారం నిర్మించిన ఇండ్లకు బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో సి.సి. రోడ్లు, మురుగు కాలువ వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం పై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసీ పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని, విద్యకు ఉన్న శక్తి అనిర్వచనీయమైనదని తెలిపారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులను అందించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, జర్మన్ భాష నేర్పించి విదేశాలలో గల ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జైపూర్ మండల కేంద్రంలో కొమురం భీమ్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఆదివాసి గిరిజనులు అడవి పై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ క్రమంలో వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం అర్హులైన గిరిజనులు పోడు వ్యవసాయం చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో అటవీ శాతాన్ని పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో ఉన్నత స్థాయిలో నిలవాలి

(మొదటిపేజీ తరువాయి)

80 వేల మంది విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు కుట్టే కార్యక్రమాన్ని అప్పగించడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ నిర్వహణ, రెబ్బెన మండలం నంబాల గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు, బస్సుల కొనుగోలు ద్వారా ప్రతినెల ఒక్కొక్క బస్సుకు 70 వేల ఆదాయం, పెట్రోల్ బంకుల ఏర్పాటు పనులు చేపట్టడం ద్వారా మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించి చదివించాలని, ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలలో సభ్యులుగా చేరని వారిని గుర్తించి సభ్యులుగా చేర్పించి నూతన సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా మహిళా సంఘాల సభ్యులు సాధిస్తున్న విజయాలు, ఉత్పత్తులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సంఘాలు అదనపు ఆదాయం పొందేలా వ్యాపార రంగాలలో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, మండల సమాఖ్య సభ్యులు, ఎపిఎంలు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్న రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమావేశమై రీ సర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ వివాదాలు, హద్దుల సమస్యలు, రికార్డుల్లో తేడాలను సరిచేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. రీ సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండి, సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు నిరంతరం పనిచేయాలని, ఎలాంటి ఆలస్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామానికి సంబంధించిన భూముల వివరాలు, ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు వ్యవసాయ భూమిలో జరుగుతున్న రీ సర్వే పనులను స్వయంగా పరిశీలించారు. ఒక ఎకరం భూమి సర్వేకు సుమారు ఎంత సమయం పడుతుందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా, హద్దులు స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ నరసింహమూర్తి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ సాగర్, ఇతర రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు అమృతం

### - తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.. సర్పంచ్ కోట వేణుగోపాల్

కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5, ప్రభాతవార్త

శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని, ప్రతి తల్లి బిడ్డకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని బారెగూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ కోట వేణుగోపాల్ సూచించారు. బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాకీజానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో మాట్లాడి తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి లభిస్తాయని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. తల్లిపాల వల్ల శిశువుల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడటంతో పాటు అనేక అనారోగ్య సమస్యల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లులు తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి, శిశువులకు క్రమం తప్పకుండా తల్లిపాలు అందించాలని సూచించారు. అదేవిధంగా తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలను సర్పంచ్ అభినందించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య, పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రేబిక, సూపర్‌వైజర్ స్పందన, వార్డు సభ్యులు చిప్పకుర్తి హరీష్, ముక్తార్ భాయ్, రూబినా తబ్బాస్సుమ్, అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, సాధన, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం

(మొదటిపేజీ తరువాయి)

అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణలో రోజుకు సుమారు రూ.5 కోట్ల మేర, దేశవ్యాప్తంగా సుమారు రూ.70 కోట్ల వరకు సైబర్ మోసాల వల్ల ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయరాదని సూచించారు. బ్యాంకింగ్, సోషల్ మీడియా తదితర డిజిటల్ సేవలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్న నిరక్ష   ్యమ్లే భారీ ఆర్థిక నష్టానికి దారితీస్తుందని పేర్కొన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమీప పోలీస్‌స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మొబైల్ ఫోన్ వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు పంపే లింకులను తెరవకూడదని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేసి, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐలు దివ్య, కిరణ్, రాజు, లక్ష్మణ్, నరేష్, సైబర్ క్రైమ్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు.



## చెన్నూరులో పర్యటించిన మంత్రి

### - మార్నింగ్ వాక్‌లో ప్రజా సమస్యలపై ఆరా
### - అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించిన మంత్రి

చెన్నూరు, ఆగస్టు 5, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో బుధవారం మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించారు. మార్నింగ్ వాక్‌లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న మంత్రి పలు వార్డుల్లో పర్యటించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని సమస్యలు తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులను స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి మంత్రి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటిస్తూ పనులను వేగవంతం చేయాలన్నారు. స్థానిక మధునపు పోచమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## హామీ నిలబెట్టుకున్న రేణుకుంట్ల ప్రవీణ్.. గ్రంథాలయానికి వాటర్ ప్యూరిఫైయర్ విరాళం

వేమనపల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త

వేమనపల్లిలోని వట్టికోట ఆళ్వారుస్వామి శాఖ గ్రంథాలయ విద్యార్థులకు తాగునీటి సమస్య తీరింది. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణుకుంట్ల ప్రవీణ్ బుధవారం గ్రంథాలయానికి వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు. గత నెల 27న గ్రంథాలయాన్ని సందర్శించిన సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన, వారి సమస్యలను తెలుసుకుని పుస్తకాలు, స్టడీ చైర్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఆగస్టు 2న పుస్తకాలు, 20 స్టడీ చైర్లను సమకూర్చగా, తాజాగా వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించి మరోసారి తన మాట నిలబెట్టుకున్నారు. దీంతో గ్రంథాలయ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ రేణుకుంట్ల ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలి

## - చౌకధరల దుకాణ డీలర్లకు అదనపు కలెక్టర్ ఆదేశం

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని చౌకధరల దుకాణ డీలర్లతో బుధవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని మొత్తం 57 మంది చౌకధరల దుకాణ డీలర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆహార భద్రత కార్డుల లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను ఆగస్టు 31లోగా 100 శాతం పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా ఈకేవైసీకి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఈకేవైసీ ప్రాధాన్యత, ఉద్దేశం, ప్రయోజనాలపై అవగాహన కల్పించి, నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే మరణించిన వ్యక్తులు, వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి అధికారులకు అందించాలని ఆదేశించారు. కాగజ్‌నగర్ మండలంలో 57 చౌకధరల దుకాణాల పరిధిలో 33,386 ఆహార భద్రత కార్డులు, 1,11,371 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటివరకు 18,857 కార్డులకు సంబంధించి 57,655 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పూర్తిగా, 12,570 కార్డులకు సంబంధించి 31,646 మంది లబ్ధిదారుల ఈకేవైసీ పాక్షికంగా పూర్తయింది. మిగిలిన లబ్ధిదారుల ఈకేవైసీని వేగవంతం చేసి నిర్ణీత గడువులో 100 శాతం పూర్తి చేయాలని డీలర్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సౌకర్యం అందేలా చూడడంతో పాటు, అనర్హులైన వారి వివరాలను సకాలంలో అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, ఆర్డీఓ కాగజ్‌నగర్, తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, డిప్యూటీ తహశీల్దార్ (పౌరసరఫరాలు), చౌకధరల దుకాణ డీలర్లు పాల్గొన్నారు.



## మండల సమావేశంలో సర్పంచ్ గళం

### - యూరియా కొరత నుంచి రహదారి వరకు.. బారెగూడ సమస్యలపై ప్రస్తావించిన సర్పంచ్ వేణుగోపాల్

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో బారెగూడ సర్పంచ్ కోట వేణుగోపాల్ గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని, అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. శివపూర్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరినందున నూతన భవనం మంజూరు చేయాలని, బారెగూడలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పశువులకు ప్రత్యేక టీకాల కార్యక్రమం నిర్వహించాలని, ఉపాధి హామీ పథకంలో పారదర్శకత పాటించి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బారెగూడ-కాగజ్‌నగర్ బీటీ రహదారి అధ్వాన్నంగా ఉన్నందున అత్యవసరంగా అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మండల ప్రత్యేక అధికారి మనోహర్, ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్, ఎమ్మార్వో మధుకర్, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా స్థానిక జనకాపూర్-1234 అంగన్వాడి కేంద్రంలో బుధవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రేణుక మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుల ఎదుగుదల, రోగనిరోధక శక్తి పెంపుతో పాటు పోషకాహార లోపాలను నివారించవచ్చని తెలిపారు. తల్లిపాలు తల్లుల ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వివరించారు. సూపర్వైజర్ పెంటు బాయ్ మాట్లాడుతూ ప్రతి తల్లి తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువులకు పూర్తిస్థాయిలో తల్లిపాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి, తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అరుణ, ఇంద్ర, విజయలక్ష్మి, రాజమ్మ, దేవమ్మ, భాగ్యక్కతో పాటు గర్భిణులు, బాలింతలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## సదాబైనామా, భూ భారతి ఫైళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

### - అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు

**బజార్‌హత్నూర్, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

తహసీల్దార్ కార్యాలయంలోని సదాబైనామా, భూ భారతి, వివిధ ధ్రువపత్రాలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు సంబంధించిన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేసి, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రును తహసీల్దార్ కె. శ్యామ్ సుందర్, కార్యాలయ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నూర్‌సింగ్, మహేందర్, జూనియర్ అసిస్టెంట్లు టి. రవి, శ్రావంతి, జీపీఓలు పాల్గొన్నారు.



## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

**భైంసా, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. ముధోల్ మండల కేంద్రంలోని విట్టోలి రోడ్డుపై బుధవారం ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం ఏఎస్ఐ యశ్వంత్ మాట్లాడుతూ.. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది నారాశక్తి తదితరులు పాల్గొన్నారు.






## బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం

### - దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి

**భైంసా, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

నవజాత శిశువులకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి సూచించారు. భైంసా మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు, చిన్నారులకు అంగన్వాడీ టీచర్లు సరైన పౌష్టికాహారం అందించాలని కోరారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డ జన్మిస్తారని పేర్కొన్నారు. తల్లి, బిడ్డ సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. అంతకుముందు గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ పీజీ ఎంట్రన్స్‌లో సుజాతకు 8, 170వ ర్యాంకులు

**భైంసా, ఆగస్టు 05, ప్రభాతవార్త:**



తెలంగాణ రాష్ట్రస్థాయి పీజీ ప్రవేశ పరీక్షలో భైంసా మండలం తరోడా గ్రామానికి చెందిన సుజాత అద్భుత ప్రతిభ కనబరిచారు. పీజీ హిందీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు, లింగ్విస్టిక్స్ విభాగంలో 170వ ర్యాంకు సాధించారు. ఈ విజయంతో సుజాత కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని ఈ సందర్భంగా సుజాత తెలిపారు. ప్రస్తుతం బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎస్ఎఫ్ఐ) విద్యార్థి నాయకురాలుగా పనిచేస్తున్న ఆమె, ఉస్మానియా యూనివర్సిటీలో చదవాలనే తన కల నెరవేరబోతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రొఫెసర్‌గా ఎదిగి విద్యార్థులకు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన సుజాతను స్థానికులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై

**సారంగాపూర్, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని స్వర్ణ గ్రామంలో బుధవారం రోజు సైబర్ నేరాలపై ప్రజలకు ఎస్సై శ్రీకాంత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, ఓటీపీ మోసాలు, నకిలీ లోన్ యాప్‌లు, సోషల్ మీడియా మోసాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. ప్రజలు తమ ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌ల వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ సోహైల్, పోలీసు సిబ్బంది జమీర్, మాధవ్, లింగరం, శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం అంకుశపూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం నిర్మించాలంటే మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండాలని తెలిపారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం మన అందరి బాధ్యత అని తెలిపారు. ముత్తు పదార్థాలు తీసుకోవడం వలన జరిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రాష్ట్రంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు రాష్ట్ర గవర్నర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులచే మత్తు పదార్థాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు, సిబ్బంది, బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.



## బిడ్డకు తల్లిపాలు అమృతం

### - ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సౌజన్య

**తాండూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

బిడ్డకు తల్లిపాలు అమృతమని తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌజన్య అన్నారు. రేచిని5 అంగన్వాడి కేంద్రంలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పట్టాలని సూచించారు. శిశువు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోతరాజుల రాంబాయి, డాక్టర్ సౌజన్య, ఉప సర్పంచ్ భీమయ్య, వార్డు మెంబర్ కేశెట్టి సంతోష్ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు పద్మ, రజిత, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులకు ప్యాడ్స్, పెన్స్, స్వీట్స్ పంపిణీ

**తాండూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పదో తరగతి విద్యార్థినిలకు బుధవారం ప్యాడ్స్, పెన్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. 1995-96 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ కు చెందిన సురభి శరత్ కుమార్ జన్మదిన సందర్భంగా తోటి మిత్రులు జన్మదిన వేడుకలు నిర్వహించి ప్యాడ్స్,పెన్స్,స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు పెద్దబోయిన శంకర్, మాస వెంకటస్వామి, మద్దిబోయిన శ్రీనివాస్,రెహమాతుల్లా ఖాన్, జయచందర్, ఆవుల శ్రీనివాస్, రెవెల్లి శ్రీనివాస్, బండి మారుతీ, లెంకతి మహేష్ పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి - నిర్మల్ జనరల్ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

**నిర్మల్, ఆగస్టు 05, ప్రభాతవార్త:**



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే లక్ష్యమని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను కలియతిరిగి చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది పనితీరు, ఇతర సౌకర్యాలపై రోగుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ఆసుపత్రిలో సిటీ స్కాన్ యంత్రం పనిచేయకపోవడం, ఎక్స్ రే ఫిలింల కొరత ఉండడంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశాలను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సిటీ స్కాన్ మరమ్మతులు చేపట్టడంతో పాటు ఎక్స్ రే ఫిలింల కొరత లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.కేంద్ర ప్రభుత్వ నిధులు రూ. 25 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవనం పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభోత్సవం అనంతరం ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. దీంతో జిల్లా ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని పేర్కొన్నారు. ఆసుపత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు రోగులతో ఆప్యాయంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ స్థానిక కౌన్సిలర్ గంజి రాజు, కౌన్సిలర్లు జింక సూరి, శ్రీరామోజు నరేష్, ఈశ్వర్, అర్జున్, విఠల్, సూరజ్, సాత్విక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, బీజేపీ నాయకులు జుట్టు దినేష్, జాప ప్రసాద్, కందుల హరీష్, అచ్యుత్ రావు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటింటికి మొక్కలు పంపిణీ

**తాండూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

మండలంలోని బోయపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్లుల మహేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

### - సైబర్ భద్రతపై విస్తృత అవగాహన: వాంకిడి సీఐ వేణుగోపాల్

**కెరమెరి,ఆగస్టు 5 ప్రభాతవార్త:**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగృత్ దివాస్ సురక్షా తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కెరమెరి మండల కేంద్రంలో వాంకిడి సీఐ వేణుగోపాల్, కెరమెరి ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో బుధవారం వ్యాపారవేత్తలతో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సీఐ వేణుగోపాల్ అన్నారు. సైబర్ క్రైమ్ టుగెదర్ ఫర్ ఏ సేఫ్ డిజిటల్ ఫీచర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఎస్ఎం నేరాలు బుల్లియ్నిగ్ స్టాండింగ్ గుర్తుతెలియని లింకులు ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ వాట్సాప్ లలో సైబర్ నేరాలు లింకులు వస్తూ ఉంటాయి . అదేవిధంగా ఏపీకె ఆర్టిఏ వంటి లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దని ఇది ఏమైనా జరిగితే 1930 డయల్ చేయాలని అవగాహన కల్పించారు. సమీప పోలీసు స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెరమెరి ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి: సంగెపు బొర్ర

**సారంగాపూర్, ఆగస్టు 05, ప్రభాతవార్త:**


తెలంగాణ రాష్ట్ర రైతాంగంలో కౌలు రైతులు తీవ్ర నిరక్ష్యాన్లికి గురవుతూ దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారని కౌలు రైతుల గుర్తింపు సాధన కమిటీ సభ్యులు సంగెపు బొర్రన్న ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో నిర్వహించిన సర్వే నివేదికను బుధవారం జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌లో తమ పేరిట అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 2011 భూ అధీకృత వాస్తవ సాగుదారుల చట్టాన్ని అమలు చేస్తూ కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. భూయజమానికి ఎలాంటి నష్టం లేకుండానే ఎరువులు, విత్తనాలు, రుణాలు పొందడానికి, అకాల వర్షాల వల్ల పంట నష్టపోతే పరిహారం అందడానికి, మార్కెట్‌లో పంటను విక్రయించుకోవడానికి ఈ కార్డులు దోహదపడతాయని వివరించారు. భూమి లేని కౌలు రైతులకు రైతుబీమా వర్తింపజేయాలన్నారు.గత మే నెలలో సారంగాపూర్ మండలంలోని ఆలూరు, కౌట్ల (బి) గ్రామాల్లో తమ కమిటీ నిర్వహించిన నిజనిర్ధారణ సర్వేలో ప్రతి ఏటా కౌలు రైతులే ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు తేలిందని పేర్కొన్నారు. సాగు కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలవుతున్నారని తెలిపారు. వర్షాకాలం (ఖరీఫ్) సీజన్‌లో వరి, పసుపు, పత్తి, సోయాబీన్, కందులు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసే కౌలు రైతులను వ్యవసాయ అధికారుల ద్వారా ధ్రువీకరించి గుర్తింపు కార్డులు అందజేయాలని కోరగా, మార్కెట్ కమిటీ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అట్లా పోతారెడ్డి, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, కిసాన్ మిత్ర షారుక్, జి. శివాకర్, ముజిగే శంకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆరోపణలు నిరాధారం... నిజానిర్ధారణకు సిద్ధం

**- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు - తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా**

**- మంత్రి పదవి చర్చకు వచ్చినప్పుడల్లా కుట్రలు జరుగుతున్నాయని ఆరోపణ**



**మంచిర్యాల, ఆగస్టు 5, ప్రభాతవార్త**

తనపై ఇటీవల వెలువడుతున్న అవినీతి ఆరోపణలను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు రాజకీయ కుట్రలో భాగంగానే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు తమకు అనుకూలంగా ఉన్న పత్రికల ద్వారా అసత్య కథనాలు ప్రచురింపజేస్తున్నారని పేర్కొన్నారు. తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని స్పష్టం చేసిన ఆయన, ఆరోపణలు చేస్తున్న వారు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. తనపై ప్రచారం చేస్తున్నట్లు చెబుతున్న నాలుగు వందల యాభై కోట్ల రూపాయల వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని వివరించారు. 2009-10 సంవత్సరంలో బ్యాంకు నాలుగు వందల యాభై కోట్ల రూపాయల రుణాన్ని మంజూరు చేసిందని, సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేరిట ఆ రుణం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పదిహేను పాఠశాలలు నిర్మించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ తాను అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని, ఇసుక లేదా భూముల వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడే ఉద్దేశం ఉంటే అప్పుడే చేసేవాడినని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కోసం పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన తనపై ఇప్పుడు తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. విదేశీ వాణిజ్య వ్యవస్థ క్షీణించిన తరువాత తనకు నూట అరవై కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. రెండు వేల పద్నాలుగు నుంచి రెండు వేల ఇరవై ఐదు వరకు సంస్థ వినియోగించిన నిధులు నూట తొమ్మిది కోట్ల పదకొండు లక్షల రూపాయలేనని, బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని నిరర్థక ఆస్తిగా గుర్తించాయని చెప్పారు. అదే కాలంలో నలభై నాలుగు కోట్ల ఎనభై ఒక లక్షల రూపాయలు చెల్లించినట్లు వివరించారు. ఆంధ్రా బ్యాంకు నిరర్థక ఆస్తిగా ప్రకటించిన తర్వాత కూడా పద్దెనిమిది కోట్ల డెబ్బై రెండు లక్షల రూపాయలు చెల్లించామని, రెండు వేల ఇరవై నాలుగు అక్టోబర్ ముప్పై ఒకటి నుంచి చెల్లింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. తనపై వచ్చిన పత్రికా కథనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించిన ఎమ్మెల్యే, ఆధారాలు లేకుండా ఎప్పుడూ ఫిర్యాదులు చేయనని స్పష్టం చేశారు. నిజానిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తే అన్ని ఆధారాలను కమిటీ ముందు సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. నాలుగు వందల యాభై కోట్ల రూపాయల మోసం జరిగి ఉంటే బ్యాంకు నూట తొమ్మిది కోట్ల రూపాయలకే వేలం ప్రక్రియ ఎలా చేపడుతుందని ప్రశ్నించారు. రుణ మంజూరు ఉత్తర్వులు తాను సృష్టించినవి కావని అన్నారు. జిల్లాలోని కొందరు నేతలు తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించిన ప్రేమ్ సాగర్ రావు, మంత్రి పదవి చర్చకు వచ్చిన ప్రతిసారి తనపై ఇలాంటి ఆరోపణలు, ప్రచారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తనపై వచ్చిన ప్రతి ఆరోపణపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో ప్రజలు, యువత కోసం సైబర్ నేరాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వస్తే వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దన్నారు. తెలియని నంబర్ల నుండి వచ్చే లింక్‌లను క్లిక్ చేయడం, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వల్ల మొబైల్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బ్యాంక్ అధికారి, ఇతర సంస్థల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు అడిగినా ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఫోన్ ద్వారా ఇటువంటి వివరాలు సేకరించారని వివరించారు. ఎవరికైనా సైబర్ మోసాలు ఎదురైన, ఏవైనా అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే భయపడకుండా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేయాలని అదేవిధంగా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్హెచ్ఓ రవి, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 50 వసంతాలు పూర్తి చేసుకోనున్న ఎస్ఆర్‌పీ1 భూగర్భ గని

**- సెప్టెంబర్ 2న ఎస్ఆర్‌పీ1 గోల్డెన్ జూబ్లీ వేడుకల నిర్వహణ**

**- గని ప్రాంగణాన్ని పరిశీలించిన శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**నస్పూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఎస్ఆర్‌పీ1 భూగర్భ గని 50 వసంతాలు పూర్తి చేసుకోనుండటం ఎంతో గర్వకారణమని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. 1976 సెప్టెంబర్ 2న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళ్ రావు చేతుల మీదుగా ప్రారంభమైన ఈ గని, త్వరలోనే గోల్డెన్ జూబ్లీ ఘట్టానికి చేరువవుతోంది. సెప్టెంబర్ 2న జరగనున్న 50 ఏళ్ల పండగను పురస్కరించుకుని బుధవారం ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్ని విభాగాల అధిపతులతో కలిసి ఎస్ఆర్‌పీ1 గని పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఆర్‌పీ1 భూగర్భ గనికి ప్రత్యేకమైన ప్రస్థానం ఉందన్నారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో ఈ గని ఎన్నో చారిత్రాత్మక రికార్డులను సృష్టించిందని, వేలాది మందికి ఉపాధి కల్పించిందని కొనియాడారు. ఒక భూగర్భ గని అర్ధ శతాబ్దం పాటు నిరాటంకంగా సేవలు అందించడం గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గని ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ చారిత్రాత్మక వేడుకల్లో ప్రస్తుత ఉద్యోగులతో పాటు, విశ్రాంత అధికారులు, విశ్రాంత కార్మికులను భాగస్వాములను చేస్తూ ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, గ్రూప్ ఏజెంట్ రవికుమార్, ఆర్.కె గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, ఏరియా ఇంజనీర్ సురేష్, గని మేనేజర్ ఆత్మారాం సహాని, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, గ్రూప్ ఇంజనీర్ మోహన్, డిప్యూటీ పీఎం క్రాంతి కుమార్, సంక్షేమ అధికారి అరుణ్ తేజ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## నజ్రూల్‌నగర్‌లో పొలం బాట

**- విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులకు అవగాహన**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**




కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్ వన్‌లో బుధవారం పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాగజ్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ వీరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పొలాల వద్ద వదులుగా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టారు. రైతులు మోటార్లకు అతుకులు లేని నాణ్యమైన వైర్లు ఏర్పాటు చేసుకోవాలని, స్టార్టర్ బాక్సులను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల మోటార్లు కాలిపోకుండా ఉంటాయని, విద్యుత్ వోల్టేజీలో హెచ్చుతగ్గులు తగ్గి సమతూకంగా సరఫరా అవుతుందని తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాల నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఇర్ఫాన్ అహ్మద్, కాగజ్‌నగర్ రూరల్ సబ్ ఇంజినీర్ ప్రసాద్, సబ్ డివిజన్ సబ్ ఇంజినీర్ ఆశారాణి, ఫోర్‌మెన్ విలాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఎమ్మాజి సతీష్, లైన్మెన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## గురుకులంలో ఘనంగా బోనాల వేడుకలు

**ఆసిఫాబాద్‌టౌన్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఆషాఢ మాసం పురస్కరించుకొని బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన బోనాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రార్థనలు చేశారు. వేడుకల్లో విద్యార్థినులు అమ్మవారి, పోతురాజు వేషధారణలో సందడి చేసి అందరినీ ఆకట్టుకున్నారు. సాంప్రదాయ నృత్యాలు, భక్తి గీతాలతో గురుకుల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాళ్లకు స్థలం కేటాయించాలి

**- కలెక్టర్‌కు మున్నూరు కాపు సంఘం ప్రతినిధుల వినతి**



**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్ముణ్ పటేల్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్ పట్టణంలో 20 గుంటలు, సిర్పూర్ కాగజ్‌నగర్ పట్టణంలో 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. సంఘ సమావేశాలతో పాటు సామాజిక, సాంస్కృతిక, విద్యా, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత కమ్యూనిటీ హాళ్లు అవసరమని వివరించారు. వినతిని సానుకూలంగా పరిశీలించి స్థలాల కేటాయింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సదాశివ్ పటేల్, సిర్పూర్ తాలూకా మున్నూరు కాపు సంఘం పటేల్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లి తిరుపతి పటేల్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు డేగల సత్యనారాయణ పటేల్, పట్టణ ఉపాధ్యక్షుడు తుపాకుల సాయి ప్రసాద్ పటేల్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట వెంకటేష్ పటేల్, సంఘ సభ్యులు పార్వతి సురేష్ పటేల్, సాయిధం అశోక్ పటేల్, పెద్దింటి హనుమంతు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**మంచిర్యాల బ్యూరో, ఆగస్టు 5, ప్రభాతవార్త**

జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కోటపల్లి శివారులోని సర్వే నంబర్ 389లో 1.12 ఎకరాల విస్తీర్ణం గల భూమిని గుర్తించడం జరిగిందని, కార్యాలయ నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చెన్నూర్ మండల డిప్యూటీ తహసీల్దార్ తో కలిసి చెన్నూర్ లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను సందర్శించి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యం తరలింపును ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని గోదాం నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేసే బియ్యాన్ని నాణ్యతతో సమయానికి పంపిణీ చేయాలని, రేషన్ కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. స్టేజ్2 కాంట్రాక్టర్ తగిన సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసి బియ్యం రవాణా, సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ధ్రువపత్రాల జారీని నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని పెండింగ్ పనులను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడం శుభపరిణామం

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్**

**నస్పూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త**



కేంద్ర ప్రభుత్వం ఎలాంటి బిడ్డింగ్ లేకుండా సింగరేణి సంస్థకు మణుగూరు పీకేఓసీ-2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను కేటాయించడం శుభపరిణామమని, ఈ నిర్ణయం ద్వారా సింగరేణికి, రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్ తెలిపారు. మణుగూరు బ్లాక్ కేటాయింపుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం శ్రీరాంపూర్ సింగరేణి ఆర్.కె-7 మైన్ వద్ద బీజేపీ నాయకులు కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాజాగా కేటాయించిన మణుగూరు కోల్ బ్లాక్ వల్ల 30 ఏళ్ల పాటు 180 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, సింగరేణికి 42,360 కోట్ల రూపాయల ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వానికి 10,500 కోట్ల రూపాయల రెవిన్యూ వస్తుందని రఘునాథ్ వెల్లడించారు. అలాగే 2 వేల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఒడిశాలోని నైని, తాడిచర్ల-2, మణుగూరు పీకేఓసీ-2 బ్లాక్‌ల ద్వారా మొత్తం 860 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. ఈ మూడు బ్లాక్‌ల ద్వారా సింగరేణికి 1,95,510 కోట్ల రూపాయల రెవిన్యూ, రాష్ట్రానికి 48 వేల కోట్ల రూపాయల ఆదాయంతో పాటు 6,500 మందికి జీవనోపాధి లభిస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం సింగరేణి పురోగతికి పూర్తి అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, నాయకులు సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, కమలాకర్ రావు, ఎనగందుల కృష్ణమూర్తి, పట్టి వెంకటకృష్ణ, ఆనంద్ కృష్ణ, ఈర్ల సదానంద, పొన్నవేణి సదయ్య, కాదాసు భీమయ్య, గొల్ల మహేందర్, కొండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబంతో సహా అదృశ్యం... అప్పులిచ్చిన వారిలో ఆందోళన

**- ప్రముఖ నెయ్యి వ్యాపారి ఆచూకీ కోసం ఎదురుచూపులు**

**- సుమారు రూ.60 లక్షల అప్పులు, ఇంటిపై రూ.70 లక్షల గృహ రుణం ఉన్నట్లు సమాచారం**

**మంచిర్యాల, ఆగస్టు 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ నెయ్యి వ్యాపారవేత్త, మల్లిఖార్జున ఎంటర్‌ప్రైజెస్ యజమాని బోయిని సంపత్ కుమార్ కుటుంబంతో సహా గత 15 రోజులుగా కనిపించకపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయనతో పాటు కుటుంబ సభ్యుల ఆచూకీ కూడా లభించకపోవడంతో బంధువులు, స్నేహితులు, అప్పులు ఇచ్చిన వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికంగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సంపత్ కుమార్ వివిధ వ్యక్తుల వద్ద నుంచి సుమారు రూ.60 లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆయన సొంత ఇంటిపై సుమారు రూ.70 లక్షల గృహ రుణం ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుటుంబంతో సహా కనిపించకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు తమ సొమ్ము తిరిగి వస్తుందో లేదోనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, గత 15 రోజులుగా సంపత్ కుమార్ మొబైల్ ఫోన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల మొబైల్ ఫోన్ నంబర్లు కూడా స్విచ్ ఆఫ్‌లోనే వస్తున్నట్లు సమాచారం. పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లభించకపోవడంతో వారి ఆచూకీపై అనుమానాలు మరింత పెరిగాయి.ఇదిలా ఉండగా, రెండు నెలల క్రితమే రామ్‌నగర్‌లోని తన సొంత నివాస గృహంపై హౌసింగ్ లోన్ తీసుకున్నట్లు కూడా స్థానికంగా సమాచారం వినిపిస్తోంది. ఆర్థిక ఇబ్బందులు,



వ్యాపార నష్టాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చనే అభిప్రాయాలు పట్టణంలో వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ విషయమై బాధితులు సంపత్ కుమార్ తల్లిదండ్రులు, అన్నదమ్ములను వివరణ కోరగా, ఖగమాకు ఆయనతో ఎలాంటి సంబంధం లేదు. కుటుంబంతో కలిసి ఎక్కడికి వెళ్లారో కూడా మాకు తెలియదుగ అని వారు తెలిపినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి, బోయిని సంపత్ కుమార్ కుటుంబంతో సహా ఆచూకీని గుర్తించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, అప్పులు ఇచ్చిన బాధితులు కోరుతున్నారు.

# ఐసిడిఎస్ పరిరక్షణకై ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమం జయప్రదం చేయాలి

**- అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

**లక్షెట్టిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట పట్టణంలో బుధవారం రోజున అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 10న కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జైల్ భరో కార్యక్రమంలో అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొనుట గురించి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం సిబ్బంది తిరుపతి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులు, సౌకర్యాలపై దాడి చేస్తూ యజమానులకు ప్రయోజనం కలిగించే విధంగా 2025 నవంబర్ 21న నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చింది. 29 కార్మిక చట్టాలను రద్దు చేసింది. వీటివల్ల కార్మికులు, ఉద్యోగులపై పని భారం పెరుగుతుంది.జీతభత్యాలు పెరగవు.ఉద్యోగ భద్రత ఉండదు.సంక్షేమ పథకాల అమలు నీరు గారుతుంది. వీటిని దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. లేబర్ కోడ్ లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశారు. దీనివల్ల వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది. నూతన విద్యా విధానం వల్ల విద్యారంగం పూర్తిస్థాయి కార్పొరేట్ కరణ అవుతుంది. విద్యుత్ సవరణ బిల్లు వల్ల వినియోగదారులపై భారం పడుతుంది. ప్రభుత్వ విద్యుత్ రంగం ప్రైవేటుపరం అవుతుంది. రైతుల గిట్టుబాటు ధర ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటన్నిటికీ నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని కార్మికులు ఉద్యోగులు వివిధ స్కీంలలో పనిచేస్తున్న అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చాయి. తెలంగాణ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరుగు జైల్ భరో నిరసన రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి ఉద్యోగులు పాల్గొంటారని తెలియజేస్తూ, అదే విధంగా మన మంచిర్యాల జిల్లా అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ కూడా పాల్గొంటారని తెలియజేస్తున్నాము. మీరందరూ సహకరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసన్న, పద్మ,భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఎంఎస్ కృషి ఫలితంగానే మణుగూరు బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయింపు

**- బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య**

**నస్పూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త**



బిఎంఎస్ నిరంతర పోరాట ఫలితంగానే మణుగూరు పీకే ఓసి 2 డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే5 గని వద్ద కార్మికులకు తీపి పదార్థాలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి పోటీగా జెన్‌కోను నిలపడం వల్ల సంస్థకు తీవ్ర ఆర్థిక నష్టం జరిగే ప్రమాదం ఏర్పడిందని విమర్శించారు. బీఎంఎస్ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి, బిఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 35 నుండి 40 ఏళ్ల పాటు సుమారు 860 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని, దాదాపు 3,000 మంది కార్మికులకు ఉపాధి భద్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి, నాయకులు రాజారామ్, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అనమలిస్ జాబితాలో సవరణలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను గల హక్కులను అనమలిస్ జాబితాలోని వివరాలను సరి చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లు నింపిన ఎన్యుమరేషన్ ఫారాలలో పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, ఇంటిపేరు, పేరు, వయసు వివరాలను సవరించుకోవచ్చని తెలిపారు. ఈ వివరాలు బూత్ స్థాయి అధికారి యాప్ లో ఉందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు అనమలిస్ జాబితాలో గల సంఖ్యను తగ్గించేందుకు సహకరించాలని, బూత్ స్థాయి ఏజెంట్లను భాగస్వామ్యులు చేసేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయం చేయాలని తెలిపారు. ఈ నెల 10 లోపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో నేడు ప్రైవేట్ ఉద్యోగాల మేళా

**- 80 మందికి అవకాశం**

**- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువతకు సదవకాశం**

**నిర్మల్, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉద్యోగాల మేళా నిర్వహిస్తున్నారు.జిల్లా ఉపాధి అధికారి జి. విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 6 గురువారం ఉదయం 11 గంటలకు నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఈ మేళా జరుగుతుంది. రెండు ప్రైవేట్ సంస్థలు పాల్గొని మొత్తం 80 మందికి ఉద్యోగాలు కల్పిస్తాయి. హైదరాబాద్‌కు చెందిన మార్కెటింగ్ రంగ సంస్థలో 30 పురుష ఉద్యోగాలు (వేతనం రూ. 15,000 18,000, ఉచిత వసతి), టెలీ కాలింగ్ విభాగంలో మహిళల కోసం 5 ఖాళీలు ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌కే చెందిన ప్రముఖ ఫార్మసీ సంస్థలో 45 మంది పురుషుల ఎంపిక జరుగుతుంది (వేతనం రూ. 15,000 20,000, ఉచిత వసతి). పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, బి.ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గలవారు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు కాపీలతో ఉదయం 11 గంటలకు నేరుగా హాజరుకావాలని కోరారు. వివరాలకు 7329911657, 8247656356, 9652707401 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.



## లక్సెట్టిపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించిన మంచిర్యాల డిసిపి భాస్కర్

**లక్షెట్టిపేట, ఆగస్టు 05, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ మంచిర్యాల డిసిపి ఎగ్గిడి భాస్కర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలన్నారు. స్టేషన్కు వచ్చిన ఫిర్యాదులను పెండింగ్లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. స్టేషన్కు వచ్చే సందర్శకులు ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెదలాలని, రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అదేవిధంగా నేరాలు అదుపు చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో రాష్ డ్రైవింగ్, బైక్ రైడింగ్ లాంటివి జరిగితే వాళ్లని అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇవ్వాలని, మార్పు రాకుంటే కేసులు నమోదు చేయాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై వాహనదారులకు అవగాహన కల్పించాలని, గంజాయి, ఓపెన్ డ్రింకింగ్, పేకాట లాంటివి మన పరిధిలో లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉండాలని అన్నారు. అనంతరం రిసెప్షన్‌తో పాటు సి సి టి ఎన్ ఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం**

**తాండూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త :**

ఈనెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం కోరారు. మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్లో బుధవారం సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఎం.ఈ.ఓ ఆఫీసులో సీసీఓ ప్రశాంత్ కుమార్ కు జైల్ భరోలో పాల్గొంటామని మధ్యాహ్న భోజన కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాగం రాజారాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, నాయకులు బొల్లం రాజేశం, దుర్గం శంకర్, కోళ్ల విజయలక్ష్మి, మహంకాళి విజయలక్ష్మి, సరిత, అరవింద, రెడ్డి మల్లక్క, హనుమక్క, వరలక్ష్మి, జైనేని లక్ష్మి, దుర్గం లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు ఆత్మీయ సన్మానం

**భైంసా, ఆగస్టు 05, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలంలోని గొల్లమాడ గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కుల సంఘం ప్రతినిధులు భైంసాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముధోల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌ను బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణరావు పటేల్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ నిధుల విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోతిలాల్ పటేల్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు చెన్న రాములు, లంబడి గజేందర్, కాపెల్లి లక్ష్మణ్, కూరే గంగాధర్, తోట రాములు, చెన్న లక్ష్మణ్, తోట లక్ష్మణ్, నాకిడి ప్యాట లక్ష్మణ్, కూరే ముత్యం, నాకిడి నవీన్, కుల సంఘ సోదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**- తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారం**


**లక్షెట్టిపేట, ఆగస్టు 5, ప్రభాతవార్త**

తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారం అని అంగన్వాడి సూపర్వైజర్ మమత అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బస్తీ దవాఖానలో హాజరైన బాలింతలకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ మధుసూదన్ హాజరై మాట్లాడుతూ.. తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించి, తల్లి పాలు వారికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తాయని, రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక అనారోగ్యాల నుంచి రక్షిస్తాయి. తల్లిపాల వల్ల తల్లికి, బిడ్డకు దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉంటాయి. అంతేకాదు, ఇది తల్లీబిడ్డల మధ్య ప్రత్యేకమైన అనుబంధాన్ని పెంచుతుంది. అలాగే పిల్లల బరువులు ప్రతి నెల తూచి వారి బరువు, ఎత్తు ప్రతి తల్లి తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత, ఎంపిడిఓ మధుసూదన్, డాక్టర్ శోభారాణి, ఫార్మసిస్ట్ అజయ్ కుమార్, సుజాత, నాగ ప్రమీల, అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి, శంకరమ్మ, ఆశా రాజేశ్వరి, లలిత, రాజమణి, ఆయా, తల్లులు, పిల్లలు కిశోర బాలికలు పాల్గొన్నారు.



# తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త**



తెలంగాణ ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై జిల్లాలోని అన్ని మండలాల అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసివిస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ హరిపిలుపునిచ్చారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2026-27 విద్యా సంవత్సర ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీచ్ ఔట్ అండ్ రీచ్ అల్ అనే నినాదానికి అనుగుణంగా చదువుకు దూరమైన ప్రతి ఒక్కరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే తెలంగాణ ఓపెన్ స్కూల్ లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు సమీపంలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలను సంప్రదించి నిర్ణీత గడువులోగా ప్రవేశాలు పొందాలని సూచించారు. విద్యే వ్యక్తిగత అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు, సమాజ పురోగతికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ యువరాజ్ మర్మట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, జిల్లా సైన్స్ అధికారి మధూకర్, తెలంగాణ ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## గాంధారి మైసమ్మ జాతర పరిసరాలను పరిశీలించిన అధికారులు

**క్యాతన్‌పల్లి, ఆగస్టు 5, ప్రభాతవార్త**

మంచిర్యాలమహా రాష్ట్ర జాతీయ రహదారి ప్రక్కన, బొక్కల గుట్ట వద్ద ఈ నెల 9న నిర్వహించనున్న గాంధారి మైసమ్మ బోనాల జాతర ఏర్పాట్లను బుధవారం మంచిర్యాల డి.సి.పి భాస్కర్, బెల్లంపల్లి ఏ.సి.పి కిరణ్ కుమార్, క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మురళి కృష్ణలు పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల డి.సి.పి భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా నేషనల్ హైవే పై వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖలకు సూచనలు చేశారు.నేషనల్ హైవే అథారిటీ అధికారి సునీల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించడం జరిగింది. భక్తులు పోలీసు అధికారులు సూచించే ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జాతర పరిసరాల్లో పారిశుధ్య పనులను నిర్వహిస్తామని తెలిపారు.మున్సిపల్ అధికారుల సూచనల మేరకు ప్రకృతి ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ పర్స రమేష్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, కాసిపేట ఎస్ఐ ఆంజనేయులు, గాంధారి ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి టిఎం సత్య నారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా నవోదయ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**- గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో నవోదయలది కీలక పాత్ర: ఎమ్మెల్సీ**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో 39వ జవహర్ నవోదయ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు తల్లిదండ్రులు, పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలిచేలా తమ ప్రతిభను పెంపొందించుకోవాలని, లక్ష్య సాధనకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. నవోదయ విద్యాలయాలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తూ దేశ నిర్మాణానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్సీ దండే విఠల్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు పొందిన డాక్టర్ వి. నరేందర్‌రెడ్డికి ఘన సన్మానం

**అల్ఫోర్స్ అధినేత సేవలు స్ఫూర్తిదాయకం: ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెతుల రాజేంద్ర పాణి**

**నస్పూర్, ఆగస్టు 5, ప్రభాతవార్త**



విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ ప్రతిష్టాత్మక లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన ప్రముఖ విద్యావేత్త, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డిని ట్రస్మా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కరీంనగర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెతుల రాజేంద్ర పాణి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ట్రస్మా ప్రతినిధులు నరేందర్ రెడ్డిని కలిసి శాలువా కప్పి, సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్ర పాణి మాట్లాడుతూ.. డాక్టర్ నరేందర్ రెడ్డి విద్యార్థుల అభ్యున్నతి కోసం అహర్నిశలు చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన ప్రవేశపెడుతున్న వినూత్న విద్యా విధానాలు ఇతర విద్యాసంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం విద్యా రంగానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్యాంసుందర్ రెడ్డి, కోశాధికారి కృష్ణారెడ్డి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, ట్రస్మా ప్రతినిధులు శ్రీధర్ రెడ్డి, ఖాజా కమ్రోద్దీన్, కే. జగన్మోహన్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, జుల్ఫికర్, పాషా, అంబాల రాజ్‌కుమార్, అమన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు ప్రోత్సాహం... మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు

**- ధరణికోట రాములు జ్ఞాపకార్థం తొలి రెండు ర్యాంకర్లకు సత్కారం...**

**- విద్యార్థులను అభినందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు**

**మంచిర్యాల, ఆగస్టు 5, ప్రభాతవార్త**




విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరణ కల్పించాలనే ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ ఆధ్వర్యంలో బుధవారం సాయికుంట ఉన్నత పాఠశాలలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు.గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కీర్తిశేషులు ధరణికోట రాములు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు లయన్ ధరణికోట వేణుగోపాల్ నగదు బహుమతులతో సత్కరించారు. మొదటి స్థానం సాధించిన జీడి గౌతమికి రూ. ఐదు వేల నగదు బహుమతి, రెండవ స్థానం సాధించిన నిమిషకవి సాయి హర్షకు రూ. మూడు వేల నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు విలువలను అలవరచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థుల్లో పోటీ తత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల్ అధ్యక్షుడు లయన్ వెంకటేశ్వర్లు, జోన్ చైర్మన్ లయన్ దొంతుల ముఖేష్, సీనియర్ లయన్ మధుసూదన్ రెడ్డి, లయన్ చందూరి మహేందర్, కార్యక్రమ అధ్యక్షుడు లయన్ ధరణికోట వేణుగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో మూడు రోజుల శతావధాన మహోత్సవం

**ఆగస్టు 8 నుంచి 10 వరకు నిర్వహణ - సాహిత్యాభిమానులకు జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆహ్వానం**

**మంచిర్యాల,ఆగస్టు 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ అవధాని డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ శతావధానం ఆగస్టు 8,9,10 తేదీలలో మంచిర్యాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పట్టణంలోని శ్రీ లక్ష్మీనారాయణ మార్వాడి మందిరంలో ఈ సాహిత్య మహోత్సవం జరగనుంది. శతావధాన షడానన, శతావధాన పూర్ణచంద్ర, శతావధాన భట్టవర్ధన, శతావధాన ద్యుమణి బిరుదులతో ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెన్నూరు ప్రిన్సిపాల్ ఎఫ్ఏసీ డాక్టర్ మారేపల్లి వేంకటరమణ పట్వర్ధన్ ఈ శతావధానాన్ని నిర్వహించనున్నారు.జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షులు దండనాయకుల వామన్‌రావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. కవులు, రచయితలు, అధ్యాపకులు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమానికి విచ్చేసే వారంతా సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు.